క్లుప్తంగా

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ



ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని జీవింత రావుపల్లి గ్రామానికి వెళ్లే దారిలో డివైడర్‌ను లారీ ఢీ కొట్టిన సంఘటన చోటు చేసుకుంది. భూపాలపల్లి నుంచి బొగ్గులోడ్‌తో వస్తున్న లారీ బుధవారం రాత్రి సమయంలో నూతనంగా నిర్మించిన డివైడర్‌ను ఢీ కొట్టింది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

జ్వరంతో బాలుడి మృతి


హిమవర్షిత్ (ఫైల్)

ములుగు రూరల్: జర్వంతో బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని జంగాపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జంగాపల్లికి చెందిన చెలిమల సురేష్–తిరుమల చిన్న కుమారుడు హిమవర్షిత్ (4) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. బుధవారం రాత్రి అస్వస్థతకు గురి కావడంతో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైనా వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. నాలుగు సంవత్సరాల క్రితం భర్త ఇప్పుడు కుమారుడు మృతి చెందడంతో తిరుమల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

పరామర్శ



వాజేడు: మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన తోటపల్లి వేణు పిడుగుపాటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, నాయకులు గురువారం పరామర్శించారు. దహన సంస్కారాల కోసం రూ.5000 ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట నాగారం మాజీ సర్పంచ్ ఆదినారాయణ, గొరారపు కోటేశ్వరరావు, ఎల్లయ్య, రమేష్, రఘుపతి, సూరిబాబు ఉన్నారు.

గుడుంబా విక్రయిస్తే చర్యలు

కన్నాయిగూడెం: గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకటేశ్ అన్నారు. మండలంలో గుడుంబా అమ్ముతున్న ఆరుగురిపై గురువారం కేసు నమోదు చేశారు. ఈ మేరకు గుడుంబా అమ్ముతున్న కల్వచర్ల రాజన్న, కుమ్మరి నారాయణ, రవాణా చేస్తున్న సునార్కని సత్యం, సునార్కని సంతోష్, దుర్గం మహేందర్, ఆశిరెల్లి రవిని తహసీల్దార్ సర్వర్ ఎదుట బైండవర్ చేశారు.

మద్యం షాపుల నిర్వహణకు గ్రామసభలు

వెంకటాపురం(కె): మద్యం షాపుల నిర్వహణకు ఈ నెల 26, 28న పెసా గ్రామ సభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26న ఉదయం పది గంటలకు నూగూరులో, 11 గంటలకు వెంకటాపురంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 28న ఉదయం పది గంటలకు బీసీ మల్లిగూడెంలో, మధ్యాహ్నం 12 గంటలకు వీఆర్‌కెపురంలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య పనులు


బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

వాజేడు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరింది. దీంతో ఎలాంటి వ్యాధులు సక్రమించకుండా ముందస్తుగా గ్రామ పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇంటి పరిసరాల్లో బ్లీచింగ్ చల్లడంతో పాటు ఎక్కడైనా నీరు ఉంటే కాలవలు తీసి పంపించారు.

సద్వినియోగం చేసుకోవాలి

రేగొండ (కొత్తపల్లిగోరి): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు దామిని యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై సాకపురం దివ్య అన్నారు. గురువారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో దామిని యాప్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు పడుతున్న సమయంలో పిడుగులు పడే అవకాశం ఉండటంతో, పిడుగు వంటి విపత్కర పరిస్థితుల గురించి దామిని యాప్ ద్వారా ముందుగానే సమాచారం తెలుసుకుని ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

- గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

కన్నాయిగూడెం: మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. పారిశుద్ధ్యపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో గ్రామాలు అధ్వానంగా ఉన్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాలపై కన్నెత్తి కూడా చూడడం లేదని తెలుపుతున్నారు. గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దోమల వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. మండల కేంద్రంలో చికెన్, మటన్ షాపుల నిర్వాహకులు వ్యర్థాలను గ్రామ శివారులో పడేస్తున్నారు. వర్షాకాలం కావడంతో దుర్వాసన వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాల్సిన అధికారులు ఏమి పట్టనట్టు పనులను గాలికి వదిలేశారు. గ్రామ పంచాయతీలలో ఇప్పటికి బ్లీచింగ్ పౌడర్ బస్తాలు లేవు. అలాగే వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో పాములు తిరిగే అవకాశం ఉంటుందని వీధి దీపాలు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్తను తొలగించాలి



గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలి. చెత్త పేరకుపోవడంతో దోమలు వృద్ధి చెంది రోగాల భారిన పడుతున్నాం. అలాగే బ్లీసింగ్ పౌడర్ చల్లి పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.

– రాజ్ కుమార్, యువకుడు

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



వర్షాకాలం కావడంతో రాత్రి పూట పాములు రోడ్లపై వస్తున్నాయి. వీధి దీపాలు లేపోవడంతో చీకటిగా ఉండడంతో కనపడడం లేదు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.

– రామరాజు, బీజేపీ జిల్లా నాయకుడు

చెత్తను తొలగిస్తున్నాం..

గ్రామాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. వర్షాకాలం కావడంతో నీటి కుంటల్లో నీరు చేరుతుంది. దీంతో దోమల వ్యాప్తి జరిగే ప్రమాదం ఉంది. బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం..

– సాజీద, ఎంపీఓ

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు


ఏటూరునాగారం: పడవలో ప్రయాణిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ


ఆస్పత్రికి వెళ్లడానికి కొండాయి నుంచి పడవలో దాటుతున్న బాలింత

ఏటూరునాగారం: మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఏజెన్సీలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని కొండాయి వద్ద జంపన్నవాగు ఉప్పొంగడంతో రాకపోకలకు ఇబ్బందిలేకుండా రెండు పడవలను అధికారులు ఏర్పాటు చేశారు. అత్యవసరం అయితేగానీ బయటకు రావద్దని, పడవల్లో ప్రయాణం కనీస అవసరాలు, నిత్యావసరాలకు మాత్రమే రావాలని కోరారు. అదేవిధంగా ఎలిశెట్టిపల్లి వద్ద పడవ ఉండడంతో వైద్య చికిత్సలకు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ప్రయాణాలను సాగిస్తున్నారు.

ముంపు గ్రామాల్లో ఏఎస్పీ పర్యటన

ఏటూరునాగారం: భారీ వర్షాలకు మండలంలోని కొండాయి వద్ద జంపన్నవాగు ఉధృతంగా ప్రవహించడంతో గురువారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ పరిశీలించారు. మల్యాల, కొండాయి, కొత్తూరు, ఐలాపురం గ్రామాల ప్రజల రాకపోకలకోసం ఏర్పాటు చేసిన రబ్బర్ బోట్‌లో ఏఎస్పీ పర్యటించి పరిస్థితిని తెలుసుకున్నారు. నాలుగైదు రోజుల వరకు వర్షం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, వాగులు దాటొద్దని లోతట్టు గ్రామాల ప్రజలకు ఏఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్‌తోపాటు కానిస్టేబుళ్లు ఉన్నారు.


ములుగు రూరల్: వరదను పరిశీలిస్తున్న భిక్షపతి

ప్రవహిస్తున్న బొగ్గుల వాగు

ములుగు రూరల్: వర్షాలకు మండలంలోని సర్వాపూర్–అంకన్నగూడెం గ్రామాల మధ్య గల బొగ్గుల వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. గురువారం ప్రజా సంఘాల జేఏసీ నాయకుడు ముంజాల భిక్షపతి బొగ్గులవాగును సందర్శించి మాట్లాడుతూ జగ్గన్నగూడెం ప్రజలు జలదిగ్బంధంలో ఉంటున్నారని అన్నారు. బొగ్గువాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని అన్నారు. ఆయన వెంట సతీష్, వెంకటేశ్వర్లు, రవి, రాజు, సాంబయ్య పాల్గొన్నారు.

గర్భిణులను ఏటూరునాగారం తరలించండి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతికుమార్


మాట్లాడుతున్న డాక్టర్ కాంత్రికుమార్

వాజేడు: కాన్పుకు సిద్ధంగా ఉన్న గర్భిణులను ఏటూరునాగారం సివిల్ ఆస్పత్రికి తరలించాలని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కోరం క్రాంతికుమార్ అన్నారు. మండల పరిధిలోని కృష్ణాపురంలో పేరూరు వైద్యాధికారి రాహిల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారుగా 50 మంది రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను ఇచ్చారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్న క్రమంలో వైద్యం పరంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తొదన్నారు. అలాగే వాజేడు వైద్యాధికారి మధుకర్ మొరుమూరు గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. గర్భిణులను పరీక్షించి మందులను అందించడంతో పాటు కాన్పుకు దగ్గరగా ఉన్న వారిని గుర్తించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల కృష్ణ, కోటిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవిచందర్


రిజిస్టర్లను పరిశీలిస్తున్న రవిచందర్

ములుగు రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. గురువారం మండలంలోని ఇంచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహించిన తీజ్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గిరిజన సాంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేసే విధంగా చూడాలని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం పాఠశాల రిజిస్టర్లను పరిశీలించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాంద్ పాషా, భిక్షపతి, రేవంత్, రాములు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం..


పడవలో ప్రయాణం చేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: వరదల ముంపు ప్రాంతాల ప్రజలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. గురువారం మండలంలోని కొండాయి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన రబ్బర్‌బోట్‌లో కొండాయి గ్రామాన్ని సందర్శించి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వరదలు తగ్గేంత వరకు ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తామని, ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. లాలయ్య, వావిలాల నర్సింహరావు, వావిలాల చిన్న ఎల్లయ్య, రమేష్ ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

కన్నాయిగూడెం: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు పల్లె నాగరాజు, పాడెం సమ్మయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ సర్వర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అన్ని క్యాడర్ల బదిలీలు పదోన్నతులు షెడ్యూల్ తక్షణమే విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వంగ పాపయ్య, శ్యామ్ సుందర్, కోటి, శివరామకృష్ణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు


ములుగు రూరల్: కేక్ కట్ చేస్తున్న జెడ్పీ మాజీ చైర్ పర్సన్ నాగజ్యోతి


ఎస్ఎస్ తాడ్వాయిలో..

జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్

గోరింటాకు సంబురాలు


గోరింటాకు సంబురాల్లో విద్యార్థినులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని ఊరట్టం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులు ఆషాఢమాస గోరింటాకు సంబురాలు గురువారం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పీజీ హెచ్ఎం కల్తి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గోరింటాకు పెట్టుకోవంతో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఉపాధ్యాయులు వెంకటరమణ సరిత, నిర్మలాదేవి, వార్డెన్ రమణ, హనుమయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు


ఎరువుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పులి సంపత్

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని రైతులకు అందుబాటులో ఎరువుల బస్తాలను ఉన్నాయని తాడ్వాయి పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్‌గౌడ్ అన్నారు. గురువారం తాడ్వాయి పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని కాటాపూర్‌లో ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఎరువులను విక్రయించేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఎరువుల కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కాయితీ లింగాచారి, రైతులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ప్రశాంత్

మంగపేట: వర్షకాలంలో సిజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని వైద్య సిబ్బంది అన్నారు. మండలంలోని కోమటిపల్లి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, తిమ్మంపేట గిరిజన బాలుర వసతి గృహం, మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం వైద్య శిబిరాలను నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వప్నిత, చెరుపల్లి పల్లెదవాఖాన వైద్యాధికారి తరుణ్, ఎంసీహెచ్ టీం వైద్యాధికారి ప్రశాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చంచుపల్లిలో..


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి యమున

మండలంలోని చుంచుపల్లిలో వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 49 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న ఐదుగురిని గుర్తించి వారికి రక్త పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బురదమయంగా రోడ్డు


బురదమయంగా మారిన రహదారి

వాజేడు: మండలమ కేంద్రం సమీపంలోని కొంగాల వాగు బ్రిడ్జి వద్ద రహదారి బురదమయంగా మారింది. వర్షాలు పడడంతో అప్రోచ్ రోడ్డు చిత్తడి చిత్తడిగా తయారైంది. వాజేడు నుంచి గుమ్మడిదొడ్డి గ్రామానికి వెళ్లాల్సిన వాహనదారులు అప్రమత్తంగా వెళ్లాల్సి వస్తుంది. బురదలో జారి పడే ప్రమాదం ఉండడంతో నిదానంగా వెళ్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

- డీపీఓ దేవరాజ్


ఎస్సీ హాస్టల్ వద్ద చెత్తాచెదారం తొలగింపును పరిశీలిస్తున్న డీపీఓ దేవరాజ్

ఏటూరునాగారం: ఏజెన్సీలో కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లు, మురుగు కాల్వల్లో ఉన్న చెత్తాచెదారం వెంటనే తొలగించాలని అధికారులు, సిబ్బందిని జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ ఆదేశించారు. మండలంలోని సాయిబాబా దేవాలయం ప్రధాన రోడ్డు, ఎస్సీ, ఎస్టీ హాస్టల్, ప్రభుత్వ పాఠశాలల వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని జీపీ సిబ్బందితో కలిసి జేసీబీ ద్వారా తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని నార్త్ పాఠశాల వద్ద అక్రమంగా నిర్మించి ఉన్న కాల్వ స్లాబ్ కల్వర్టు తొలగించి నీరు బయటకు పంపించామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఉన్న చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించినట్లు తెలిపారు. బ్లీచింగ్ రోడ్ల వెంట చల్లించడంతో పాటు దోమల నివారణ మందులను కూడా పిచికారీ చేయించనున్నట్లు తెలిపారు. వాగులు, వరదల వల్ల ఎలాంటి ఇబ్బంది రాకుండా గ్రామాల్లో సైతం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సిబ్బంది వెంకన్న, లక్ష్మీనారాయణ, దయాకర్ పాల్గొన్నారు.

డ్రెయినేజీలను శుభ్రంగా ఉంచాలి

- మున్సిపల్ కమిషనర్ సంపత్


డ్రెయినేజీని శుభ్రం చేయిస్తున్న కమిషనర్ సంపత్

ములుగు రూరల్: డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ సంపత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై ఓ డ్రెయినేజీ పేరుకుపోవడంతో సిబ్బందితో గురువారం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద నీరు ఎప్పటికప్పుడు వెళ్లే విధంగా చూడాలన్నారు. డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోతే తొలగించాలన్నారు. పూడికతీత పనులు చేపట్టి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు బలరాం


గోవిందరావుపేట: మాట్లాడుతున్న బలరాం

ఏటూరునాగారం/గోవిందరావుపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం పిలుపునిచ్చారు. గురువారం ఏటూరునాగారంలో, పస్రాలో ఏర్పాటు చేసిన సమావేశాలకు హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్క కార్యకర్త ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. అప్పుడు బీఆర్ఎస్ ఇప్పుడు కాంగ్రెస్ గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. స్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, హరిత హారం వీధిలైట్లు, సిమెంట్ రోడ్లు అన్నీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే చేశారని చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం మండల అధ్యక్షుడు చక్రవర్తి, ఇన్‌చార్జ్, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి, జినుకుల కృష్ణాకర్, జిల్లా నాయకుడు సాంబశివరావు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు గండిపెల్లి సత్యం, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్దన్, పస్రాలో మండల అధ్యక్షుడు మార్క సతీష్, సాంబశివుడు, కృష్ణాకర్, సురేందర్, జ్యోతి, రవీందర్ రెడ్డి, సత్యనారాయణ, అశోక్, రాజన్న, మురళి, సోమిరెడ్డి, నాగేశ్వరరావు, మధుసుదన్ రెడ్డి, కిరణ్, శిభూషోరేన్, మల్లారెడ్డి, పాండు, సారయ్య, శ్రీనివాస్, రంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పస్రా ఎస్సై అచ్చ కమలాకర్

గోవిందరావుపేట: మండలంలోని ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ చేపల వేటకు వెళ్లొద్దని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండలంలోని గుండ్లవాగు ప్రాజెక్టు, లక్నవరం సరస్సులను సిబ్బందితో కలిసి గురువారం ఎస్సై అచ్చ కమలాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు ప్రవహిస్తున్నాయని తెలిపారు. గుండ్లవాగు ప్రాజెక్టు నీటి సామర్థ్యం 25 అడుగులు కాగా 24.5 అడుగులు వచ్చాయని అన్నారు. ప్రాజెక్టు అతి తక్కువ సమయంలో మత్తడి పడే అవకాశం ఉందని అన్నారు. ప్రజలు వర్షం తగ్గే వరకు పశువులని, మేకలని ఇంటి దగ్గరే మేపుకోవాలని అన్నారు. ప్రమాదం అనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా పస్రా పోలీస్ స్టేషన్ నంబర్లు 87126 70085, 87126 70086 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.